## కథ

**ఆ** రోజు 26వ తారీకు. అయితే అది మనకు సంపూర్ణ స్వాతంత్ర్య దినోత్సవ పండుగగా జరుపుకునే జనవరి 26 కాదు. అలా అయినా మాధవరావు లాంటి సామాన్యుడికి ఒరిగేదేం లేదు. 'ఎంతెంత దూరం' అంటే 'కోసుదు కోసుదు దూరం' అని అనుకుంటూ రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు ఈదుకుంటూ పోయే వ్యక్తి మాధవరావు.



# ఐదొందలు

జయంతి వెంకట రమణ

అతనికి దేశం గురించి, దేశ స్వాతంత్ర్యం గురించి, దేశ రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితుల గురించిగాని ఆలోచించే సామర్థ్యం గాని, విశ్లేషించే తెలివితేటలుగాని లేవు; ఓపికా లేదు. 'ఈ పాటి గుమాస్తా ఉద్యోగం ఉంది కాబట్టే బతుకు గలుగుతున్నాను. లేకపోతే ఏమయిపోయే వాడినో' అని భయపడే పిరికివాడు. డి.ఏ. పెరిగిందంటే పెరిగినదంతా తనకే మిగిలిపోతుందని ఆశపడే అల్ప సంతోషి. అలాంటి మాధవరావు 'ఈ రోజింకా 26వ తారీకేనా, ఇంకా ఆరు రోజులు గడవాలా?' అంటూ నిద్ర లేవడంలో అబ్బురమేమీ లేదు. 'ఇంకా ఆరురోజులా' అనుకున్నాడు మరోసారి, చల్లారిపోయిన కాఫీని పదోసారి చప్పరిస్తూ.

''ఏమిటీ! మీలో మీరు అనుకుంటున్నారు? కాఫీ బాగోలేదనా? నేనేం చేయను. కాఫీ పొడి అయిపోయింది. ఉన్నదేదో దులిపాను. కందిపప్పు అయిపోయింది. గేస్ ఎన్నాళ్ళొస్తుందో తెలీదు. ఇక మీ ఇష్టం. ముందుగా చెప్పలేదని నన్ననకండి,'' అంది అతని అర్ధాంగి రాజేశ్వరి.

మాధవ రావుకి పీక మొయ్యా కోపం మొచ్చింది. కాని భార్య మీద చూపలేక పోయాడు. 'ఆమె మాత్రం ఏం చేయగలదు. ఆమె ఎంత పొదుపుగా లేకపోతే ఈ ఇల్లు నడిచేను.' అని అనుకుంటూ కాఫీ గబగబా మింగేసి పర్సు తీశాడు; ఎంతుందో చూద్దామని. అందులో ఒక ఐదు రూపాయల నోటు, నాలుగు రూపాయల చిల్లర, ఒక పాత లాటరీ టిక్కట్టు తప్ప మరేమీ లేవు. లాటరీ టిక్కట్టు చాలా పాతది. ఆ రోజు ఆఫీసు నుండి వచ్చేస్తూంటే లాటరీ టిక్కెట్లమ్మేవాడు- లక్ష్మీ దేవి రెండు లక్షల రూపంలో వచ్చి చేతుల్లో పడబోతోందని, ఆలసించవద్దని, ఊరించి ఊరించి చెప్పేస్తోంటే- మరిక ఆగలేక రెండు రూపాయలిచ్చి ఆ టిక్కట్టుకు అధికార్నై, లక్షాధికారైనట్టు రాత్రంతా కలలు కన్నాడు. సూర్యుడు మామూలుగానే ఉదయించాడు. లక్ష్మీ దేవి మాత్రం అతని వేపు కన్నెత్తి చూడలేదు. అప్పటి నుండి ఆ టిక్కట్టు అతని పర్సులో అలానే ఉండిపోయింది. లాటరీ టిక్కట్టును చూచిన మాధవ రావు చింపి పారేద్దామని పర్సు నుండి పైకి లాగాడు. చింపబోతూనే, లాటరీ టిక్కట్టు వెనకనున్న ఎడ్రస్‌ను చూచి ఆగిపోయాడు. అది మిత్రుడు రాజారావు ఎడ్రస్. బాల్యమిత్రుడైన రాజారావు ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. సినిమాలకు మాటలు రాస్తాడు. బాగానే సంపాదిస్తున్నాడు. 'వీలుచూచుకుని మంచి కథ రాసి హైదరాబాదురా. తరువాత సంగతి నే చూచుకుంటాను' అన్నాడో మూడు సంవత్సారాల క్రితం- ఎడ్రస్ రాసిస్తూ. ఆ మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తూంటే టిక్కట్టును చింప బుద్ధి కాలేదు. ఎప్పటికైనా పనికొస్తుందనిపించిందతనికి. ఎక్కడైనా డైరీలో రాసుకుంటే మంచిదనిపించింది. జీవిత భీమా ఏజెంటు పదేళ్ళ క్రితం ఇచ్చిన డైరీ గుర్తుకొచ్చింది. దాపరికం లేకుండా అంతా రాసుకుందామని రాయటం ప్రారంభించాడు. ఏ దాపరికం, ఏ హిపోక్రసీ లేకుండా రాసుకున్నాడు కొంతకాలం. కాని డైరీ గుండెంత పదిలం కాదని, దానిని పదిల పరచే లాకరు తనింటిలో లేదని గుర్తు తెచ్చుకుని, కాగితాలు చింపేద్దామని- చింపలేక- ఖర్చు పద్దులు రాయటం మొదలు పెట్టాడు. కాని అందువల్ల ఏ ప్రయోజనం లేదని రాయడం ఆపేసి ట్రంకు పెట్టె అడుగున పడేశాడు. అది గుర్తు కొచ్చి మంచం క్రింద నుండి ట్రంకుపెట్టె పైకి లాగి, అడుగునున్న డైరీని బయటకు తీశాడు.

''బజారుకెళ్ళరూ?'' గుమ్మం దగ్గర నిలబడి అడిగింది రాజేశ్వరి.

''దేనికీ?'' అడిగాడు తలెత్తకుండా.

''కంది పప్పు... కాఫీ పొడరు...'' అంటూ వెళ్ళిపోయింది.

మాధవ రావు మాటాడ లేదు. డైరీ తెరిచాడు. డైరీని చూడగానే ఏడు సంవత్సరాలుగా కట్టలేని ప్రీమియములు గుర్తుకొచ్చాయి. నెమ్మదిగా పేజీలు తిప్పి, తనకిష్టమైన పేజీ దగ్గర ఆగాడు. తనకు తప్ప మరెవరికీ అర్థం కానట్టు రాసుకున్న ఆ నాలుగు వాక్యాల్ని చదువుకున్నాడు. మనసెంతో తేలికైంది. సుఖాల నందరూ పంచుకుంటారు. కష్టాల్ని, బాధల్ని విని ధైర్యాన్నిచ్చి సముదాయించే వారెంత మంది? అలా ఓదార్పునిచ్చే నేస్తమున్న తానెంత అదృష్టవంతుడు. కాని స్నేహాన్ని అర్థం చేసుకోలేని వారిని చూస్తే ఏమనిపిస్తుంది? ఏడుపు గుండెల్లోంచి తన్నుకొచ్చింది. గబ గబా పేజీలు తిప్పి ఎడ్రస్ రాయడానికి ఓ చోట పెన్నుతో రాయబోతూంటే క్రింద నుండి ఎగుడు దిగుడుగా ఏదో అడ్డు తగిలింది. ఎడ్రస్ గబ గబా రాసి, పేజీలు తిప్పి ఆగి ఒక్కసారి ఆశ్చర్యపోయాడు. అక్కడ దర్శనమిచ్చింది కొత్త ఐదొందల రూపాయల నోటు. కొద్ది సేపు తిక మక పడ్డా వెంటనే గుర్తుకొచ్చింది. ఓ నాలుగు కాదు మూడు సంవత్సరాల క్రితం ప్రియ మిత్రుడు రంగారావు గృహ ప్రవేశ సందర్భముందని తెలిసి జీతాలు వచ్చిన రోజే ఐదొందల నోటుని చాల జాగ్రత్తగా డైరీలో పదిలపరచాడు- నెల మధ్యలో డబ్బుకోసం వెతుకులాట కష్టమని. అయితే రంగారావు ఎవర్నీ ఇబ్బంది పెట్టడం యిష్టం లేక పిలవనూ లేదు. అయినా వెళ్దాములే అనుకున్న తను- మామ గారి అనారోగ్యం కారణంగా కాకినాడలో వారం పదిరోజులు ఆసుపత్రి డ్యూటీ చేయడం, అక్కడ నుండి వచ్చేసి తన డ్యూటీ రంధిలో పడి నోటు సంగతి మరిచిపోవడం జరిగింది. మరపుకొచ్చినప్పుడా నోటు నెక్కడ పెట్టాడో గుర్తురాకపోవడం జరిగింది. ఇప్పుడు మాధవ రావు కానందం కలిగింది. గబ గబా నోటును పైకి లాగి పెట్టెను మంచం క్రిందకు తోసి వంటింటి గడప దగ్గర కొచ్చి ఆగాడు.

''రెండోసారికి కాఫీ లేదు. వెళ్ళండి,'' అంది రాజేశ్వరి.

''అందుకోసం కాదోయి. ఆ మధ్య నీవేవో కొనుక్కోవాలనుకున్నావు కదూ...''

''నేనా! నేనేమిటడిగాను! అయినా ఇచ్చేందుకు మీరు కామధేనువా? కల్పతరువా?''

''అంత పెద్ద కోర్కెలు తీర్చగలిగే వాడిని కాను గాని, చీర లేవో కావాలన్నట్టున్నావు?''

''ఇప్పుడు చీరలకేం గాని, కంది పప్పు, ఓ పావు కేజీ కాఫీ పొడరు...''

''అలాగే లేవోయి. కట్టుడు చీరలు బొత్తిగా లేవన్నావు కదూ. అందుకని ఈ రోజు నీవు, నేనూ అలా బజారు కెళ్ళి నీకో రెండు చీరలు, నేనో పెన్ను కొనుక్కొద్దాం.''

''చీరలు అని బహువచనంలో అంటున్నారు. ఇంతకీ మీ దగ్గరెంతుందేమిటి?''

''ఐదొందలు'' అంటూ జరిగిందంతా చెప్పాడు.

''ఇంట్లో ఉండే దాన్ని నేనెలా ఉంటే ఏం గాని, పెద్దమ్మాయి ఏదో సైన్సు బుక్కు కావాలంటోంది; నెల రోజుల నుండి. ఏవిటో డాక్టరవాలని దాని ఉబలాటం.''

మాధవ రావు బుర్ర గోక్కున్నాడు. కూతురు డాక్టరవటమా? ఇది జరిగే పనేనా? ఏ ఖర్చు లేకుండా సీటు వచ్చినా, తాను చదివించగలడా? లాభం లేదు. ఆశల్ని మొగ్గ దశలోనే తుంచేయాలి- అనుకున్నాడు. ఏ మూల నుండి విన్నదో రివ్వున పరుగెత్తుకొచ్చి తల్లి చాటున చేరి, ' అమ్మా నాన్న గారు డబ్బులిస్తున్నారా?'' అంది.

మాధవ రావు కూతురి ముఖం లోకి చూశాడు. ఆ అమ్మాయి కళ్ళలో ఆశలు అతన్ని కదిలించాయి.

''పుస్తకం ఖరీదెంతుంటుందమ్మా,'' అడిగాడు కూతుర్ని.

''సెకండు హేండ్ మార్కెట్టులో రెండు వందలకొస్తుంది. పై నెల మరో పుస్తకం కొనుక్కుంటే సరిపోతుంది,'' అంది పెద్దమ్మాయి వసంత.

''అలాగేలే పుస్తకం కొనుక్కుందువుగాని. వచ్చే నెలే అమ్మకి చీరలు కొందా ం.''

''అలా ఎందుకండి, నా కోసం అమ్మ చీరలు మానేస్తారా? అలా వద్దు. పుస్తకం వచ్చే నెల...''

''ఏం చేస్తారో మీ తండ్రీ కూతుళ్ళ ఇష్టం. అవతల వంటింటిలో నాకు బోలెడు పనుంది. వీలయితే ఆ చేత్తో ఓ అరకేజీ శనగ నూనె, కేజీ పంచదార తెచ్చి పడేయండి,'' అందామె పోబోతూ.

''అంతేనా? ఇంకా ఏమైనా ఉన్నాయా?'' అన్నాడు కాస్త గట్టిగానే.

''ఎందుకంత కోపం? నేనేదో తిని పోతున్నట్టు,'' అందామె వెనుదిరిగి.

''ఎవరో తిని పోతున్నారని కాదు. నాలుగు సార్లు ఆ మార్కెట్టుకి ఆ డొక్కు సైకిలు మీద తిరగలేక. చెప్పేవేవో ఒక్కసారి చెప్పేస్తే, అప్పో సొప్పో చేసి పడేద్దామని.''

''చెప్పడానికేం చాలా ఉన్నాయి. ఇప్పుడన్నీ అయ్యేవి కావు. ఎక్కడ పడితే అక్కడ అప్పులు పేరుకుపోతూనే ఉన్నాయి. ముందు దాని పుస్తకమేదో తెచ్చి పడేయండి. వీలయితే ఆ నాలుగు వస్తువులు తెండి.''

''సరేలే! బావి దగ్గర ఖాళీగా ఉందా? చూడు''

''ఎప్పుడో నీళ్ళు [illegible] పెట్టానే అమ్మా,''

# స్టార్‌డమ్ వైపుగా శృతి

కమల్‌హాసన్, సారిక కూతురు శృతిని అదృష్టం వెతుక్కుంటూ వచ్చింది. అమీర్‌ఖాన్ మేనల్లుడు ఇమ్రాన్‌ఖాన్ హీరోగా నిర్మిస్తున్న చిత్రంలో శృతి ఎంపికయింది. సంజయ్‌దత్, మిథున్‌చక్రవర్తి లాంటి స్టార్స్ నటిస్తున్న ఈ చిత్రంలో శృతి చేయడం అంటే అదృష్టం వెతుక్కుంటూ వచ్చినట్లేనని అంటున్నారు. ఈ సందర్భంగా సోహామ్ షా మాట్లాడుతూ ఈ పాత్రకి ముందు చాలా మందిని అనుకున్నా కొత్త అమ్మాయి అయితేనే బావుంటుందని భావించాం. ఈ క్రమంలో చాలా మంది కొత్తవారిని పరిశీలించాం. చివరకి శృతి అయితేనే ఆ పాత్రకి సరిగ్గా సరిపోతుందని భావించాం. ముందు ఆమెను కలిసినప్పుడు మాకు వెంటనే ఓకే చెప్పలేదు. పాత్ర గురించి, సినిమా గురించి తండ్రితో సుదీర్ఘంగా చర్చించింది. కమల్ అంగీకరించిన తరువాతే తాను ఓకే అంది. జూలై రెండవ వారంలో సౌత్ ఆఫ్రికాలో ఈ సినిమా షూటింగ్ మొదలవుతుంది.



అంటూ పెరటిలోంచి వచ్చింది చిన్న అమ్మాయి.

మాధవ రావు కూతురి వేపు అనుమానంగా చూశాడు. ఆ పిల్ల అవతలి వాళ్ళతో అవసరముంటే తప్ప, వాళ్ళ ఊసు పట్టించుకోదు. మాధవ రావుకా విషయం బాగా తెలుసు. భుజాలెగర వేస్తూ భార్య వేపు చూశాడు.

''నా వేపు అందరూ చూస్తున్నారు గాని, నాకేవీ అక్కర లేదు. అక్కకి ఎన్ని పుస్తకాలయినా కొంటారు. తమ్ముడు అడిగిన వెంటనే కొంటారు. నన్ను మాత్రం ఏం కావాలని అడగరు. కొత్త బట్టలు అక్కకి, అది వాడి వదిలేసినవి నాకూనూ. ఎప్పుడూ అంతేగా. నా కాంపస్ బాక్సు పాడయిపోయింది. స్కేలు మీద అంకెలే కనబడటం లేదు,'' అంది చిన్నమ్మాయి శారద.

మాధవ రావు మనస్సు చివుక్కుమంది.

''కొత్తది కొనిస్తా లేవే ట్టి తల్లీ. కాని కొత్తది కొనిచ్చేంత వరకూ మాత్రం పాతది పారేయకు సుమా!'' అంటూ కూతురి తల నిమిరి బావి దగ్గరికి వెళ్ళాడు.

ఆర్థిక ఇబ్బందుల వల్ల, మనిషి ఎన్నింటిని కోల్పోతున్నాడో తెలియని వాడు కాదు మాధవ రావు. పెళ్ళయిన కొత్తలో భార్య ముఖంలో ఉండే అందం, ఆనందం ఇప్పుడు లేవు. అందరి పిల్లల్లో ఉండే ఉత్సాహం, సంతోషం తన పిల్లల్లో లేవు. ఏది అడగాలన్నా పాపం వాళ్ళకి సంకోచమే. అన్నిటికీ భయమే. మరో అయిదు వందలుంటే... మరో అయిదు వందలు! పిల్లలడిగినవన్నీ భార్య చీరల సైతంగా కొని తేలేడూ! వాళ్ళ ఆనందాల్ని వాళ్ళ ముఖాలలో చూడలేడూ! మళ్ళా అప్పు చేయాలి దానికి వడ్డీ కట్టాలి. ఇలా వడ్డీలే కడుతూంటే జీతంలో మిగిలేదెంత?

స్నానం ముగించి ఇవతలికొస్తూంటే శారద తండ్రి ముందోసారి తచ్చాడింది. బట్టలు వేసుకుని ఇవతలికి వస్తూంటే, ''ఇంటికి కావలసినవి, పిల్లలకి కావలసినవి తెచ్చి పడేయండి. నా చీరలూ సారెలూ తర్వాత....'' అంది రాజేశ్వరి- నూనె కేను, చేతి సంచీ చేతికందిస్తూ.

జోళ్ళలో కాళ్ళు పెట్టబోతూంటే, ''నాన్న గారూ, గేస్ అయిపోయింది. పక్క వీధిలోంచి కిరసనాయిలు తెప్పిస్తానంటోందమ్మ. డబ్బులివ్వండి. తెస్తా,'' అంటూ చేయి చాచి నిలబడింది పెద్దమ్మాయి వసంత.

''నే తెస్తాలెమ్మా. ఆ డబ్బా పట్రా,'' అంటూ సైకిలు ముందు కెళ్తూంటే, ''నెలాఖరు వరకు వస్తుందనుకున్నానండీ,'' అంది రాజేశ్వరి సంజాయిషీ చెప్పే ధోరణిలో.

''నువ్వు మాత్రం ఏం చేస్తావులే. ఇప్పుడు మనం అనుకున్నవన్నీ కొనుక్కోవాలంటే మరో అయిదు వందలుండాలి. మన వీధి చివర కాసులమ్మ గార్ని అడగరాదూ. వడ్డీకేలే. వచ్చే నెల తీర్చేద్దాము. నీవడిగితే ఆమె కాదనదు.''

''అలాగేం వద్దుగాని, పిల్లల పుస్తకాలు, ఇంటి సామాను - అన్నింటి కంటే దాని బాక్సేదో తెచ్చి పడేయండి. లేకపోతే ఇల్లు పీకి పందిరేస్తుందది,'' అందామె.

గేటు వేసి సైకిలు నడిపిస్తూ ఒక్కసారి ఆగిపోయాడు. వెనక్కి తిరిగి చూస్తే రాజేశ్వరి కూడ తను చూసిన వేపే చూస్తోంది.

వేగంగా రిక్షా గేటు ముందాగింది.

రిక్షా ఆగిన శబ్దం విని ఇంట్లో పిల్లలు పరుగెత్తుకొచ్చారు.

రిక్షాలోంచి దిగుతున్న వాళ్ళను చూచి, ''సుధాకర్, కల్పన, ప్రభాకర్, అత్తా... అందరూ వచ్చారోచ్!'' అంటూ రిక్షా వేపు పరుగెత్తారు.

''తిరుపతి నుండా ఏవిటే రాక!?'' అడిగాడు మాధవరావు.

''మరే. మీరేమిటి? మేమొస్తున్నట్టు ముందుగానే తెలుసా, బజారుకు బయలు దేరారు?'' చమత్కరించాడు బావ మరిది.

''మరే. మీ అక్కయ్యతో మాటాడుతూండండి. ఇప్పుడే వస్తా,'' అంటూ సైకిలెక్కబోతూ రాజేశ్వరి మాటలు విని ఆగాడు మాధవ రావు.

''బాగుందమ్మా! ఇంకా ఇంట్లో అడుగు పెట్టనే లేదు. అప్పుడే తిరుగు ప్రయాణం గురించా. రాక రాక వచ్చారు. ప్రయాణ బడలిక తీర్చుకుని నాలుగు రోజులుండి వెళ్దరు గాని,'' అని ఆమె అంటూంటే, '' ముందు ఇంట్లోకి తీసికెళ్ళు,'' అంటూ సైకిలెక్కాడు; తానే సామాన్లు తేవాలో, ఎంతెంత తేవాలో అంచనా వేస్తున్న మాధవ రావు అంచనాల్లోంచి భార్య చీరలు, కూతురి పుస్తకాలు, శారద కంపస్ బాక్సు, తన పెన్నూ- అన్నీ కొట్టుకుపోయాయి. ఇప్పుడతని ఆలోచనలన్నీ రాక రాక వచ్చిన బంధువులనెలా గౌరవించాలన్నదే. అనుకోకుండా కనిపించిన ఐదొందల నోటు ఎన్నెన్నో ఆశలు కల్పించి... చివరికి... చివరికి... మాధవ రావుకు నవ్వు వచ్చింది.

అతనికి అర్థంకానిదొకటే-

డబ్బు దొరికిందని అవసరాలు పుట్టుకొచ్చాయా, లేక అవసరాలుంటాయని డబ్బు దొరికిందా అన్నది.

కాని అర్థమైందొకటే-

ప్రతి నెలలాగే ఈ నెల కూడా తాను అప్పు చేయక తప్పదన్నది.

★